ప్రచురణార్హమైన

**భారతదేశ సర్వోన్నత న్యాయస్థానము**

**క్రిమినల్ అప్పీల్లేట్ జూరిస్డిక్షన్**

**స్పెషల్ లీవ్ పిటిషన్ (సిఆర్ఎల్.) నెం. 2397-2398/2019**

అనూప్ బార్టారియా మరియు ఇటిసి. ....ధరఖాస్తుదారులు

వర్సెస్

డిప్యూటీ డైరెక్టర్ ఎంఫోర్స్మెంట్ డైరెక్టరేట్ మరియు ఇంకొకరు. ....ప్రతివాదులు

# తీర్పు

**గౌరవ న్యాయమూర్తి బెలా ఎమ్. త్రివేది.**

1. ఈ దరఖాస్తుల ద్వారా , దరఖాస్తుదారులు , రిట్ దరఖాస్తు నెం. 704/2018 మరియు ఎస్. బి. క్రిమినల్ రిట్ దరఖాస్తు నెం. 757/2018 లను త్రోసిపుచ్చుతూ మరియు దరఖాస్తుదారులపై రూ. 50, 000/-ల ఖర్చులను విధించుతూ తేదీ 21.02.2019 న రాజస్థాన్ హైకోర్టు వారి జైపూర్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేయడమైనది.

2. వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ కు డైరెక్టర్ అయిన ప్రస్తుత ధరఖాస్తుదారైన అనూప్ బర్టారియా తనకు వ్యతిరేకంగా ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వారి జైపూర్ జోనల్ ఆఫీసు నమోదు చేసిన ఇసిఐఆర్ No.JPZO/01/2016 ను రద్దు చేయమనియు మరియు ప్రతివాదులను తనకు వ్యతిరేకముగా ఏ విధమైన నేర సంబంధమైన ఫిర్యాదును దాఖలు చేయకుండానూ, ఇసిఐఆర్ కు సంబంధించి తనకు వ్యతిరేకముగా ఏ విధమైన బలవంతపు చర్యలను తీసుకోకుండానూ ఆదేశములు ఇవ్వమనియు కోరుతూ ఎస్‌బి క్రిమినల్ రిట్ పిటిషన్ నెంబర్ 704/2018 ను దాఖలు చేసి ఉన్నారు మరియు కంపెనీ ల చట్టం క్రింద నమోదు కాబడిన వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ కంపెనీ తన డైరెక్టర్ ద్వారా ఎస్‌బి క్రిమినల్ రిట్ పిటిషన్ నెంబర్ 757/2018 ను ఫైల్ చేసి , ఇసిఐఆర్ No.JPZO/01/2016 లోని ప్రాసిక్యూషన్ ఫిర్యాదును రద్దు పరచమని, కోరియున్నారు.

3. దరఖాస్తుదారుల కేసు ప్రకారం, ధరఖాస్తుదారుడైన అనూప్ బర్తారియా నిర్మాణం, వాస్తు శిల్పం మరియు రూపకల్పన సంప్రదింపు సేవలను అందించడంలో నైపుణ్యం కలిగిన మరియు అవార్డు పొందిన ప్రముఖ ఇంజనీర్ మరియు వాస్తు శిల్పి. ఇంకా ఇతడు కంపెనీల చట్టము, 1956 కింద నమోదు చేయబడిన వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ (ఇంతకు ముందు M/s RF ప్రాపర్టీస్ & ట్రేడింగ్ లిమిటెడ్) కు ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కూడా. వరల్డ్ ట్రేడ్ పార్క్, జైపూర్లోని జెఎల్ఎన్ మార్గ్ వద్ద ఉన్న, అత్యంత ప్రాచుర్యం పొందిన రియల్ ఎస్టేట్ వాణిజ్య ఆస్తులలో ఒకటి. వరల్డ్ ట్రేడ్ పార్క్ కంపెనీ, వివిధ ఆసక్తిగల కొనుగోలుదారులకు వాణిజ్య స్థలాలను విక్రయించడం మరియు లీజుకు ఇచ్చే వ్యాపారంలో నిమగ్నమై ఉంది.

4. మిస్టర్ భారత్ బాంబ్ మరియు అతని సహచరులు ఈ వరల్డ్ ట్రేడ్ పార్కులో వాణిజ్య యూనిట్ల కొనుగోలు కోసం పిటిషనర్లను సంప్రదించి కొన్ని యూనిట్లను బుక్ చేశారు.ప్రారంభంలో వాణిజ్య యూనిట్లను రాజ్ దర్బార్ మెటీరియల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట బుక్ చేశారు. మరియు

భారత్ బాంబు ద్వారా వివిధ మొత్తాలుగా , మొత్తం రూ. 74.02 కోట్ల సొమ్మును డిమాండ్ డ్రాఫ్ట్ మరియు/లేదా ఆర్టీజీఎస్ ద్వారా ధరఖాస్తుదారులకు చెల్లించబడింది. ఇంకా ఉదయపూర్లో మిస్టర్ బాంబ్ తీసుకువస్తున్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసమై ఆర్కిటెక్చరల్ డిజైనింగ్ మరియు కన్సల్టెన్సీ సేవల కోసం భారత్ బాంబ్ నుండి కొన్ని నిర్దిష్ట మొత్తాలలో 1.40 కోట్ల రూపాయలు అనూప్ బర్టారియా అందుకున్నారు . అయితే, తర్వాత మిస్టర్ బాంబ్ మరియు అతని సహచరులు, కొత్త సంస్థల పేరిట యూనిట్లను నమోదు చేయమని పిటిషనర్లను కోరారు, అందువల్ల పిటిషనర్లు ఎం/ఎస్ రాజ్ దర్బార్ మెటీరియల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డిపాజిట్ చేసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చారు. ఆ తరువాత 2015 వ సంవత్సరంలో, ధరఖాస్తుదారులు 34 రిజిస్టర్డ్ క్రయ పత్రాలను అమలు చేయడం ద్వారా మిస్టర్ భారత్ బాంబ్ మరియు అతని సహచరులకు 34 వాణిజ్య స్థలాలను విక్రయించారు. ధరఖాస్తుదారుల ప్రకారం, ఈ మొత్తాలను డిమాండ్ డ్రాఫ్ట్లు మరియు/లేదా ఆర్టీజీఎస్ ద్వారా వారు అందుకున్నారు , రిజిస్ట్రేషన్కు అవసరమైన అన్ని చట్టపరమైన ఫార్మాలిటీలు కూడా నిర్ణీత సమయంలో అనుసరించబడ్డాయి. మిస్టర్ బాంబ్ ఆదేశాల మేరకు ఈ యూనిట్ల స్వాధీనం కూడా సంబంధిత సంస్థలు/వ్యక్తులకు అప్పగించబడింది.

5. పిటిషనర్లు వరల్డ్ ట్రేడ్ పార్క్ యొక్క యూనిట్లు/స్థలాలను తాకట్టు పెట్టి ఐడిబిఐ బ్యాంక్ మరియు డిహెచ్ఎఫ్ఎల్ నుండి రుణం/ఆర్థిక సహాయం తీసుకున్నారు. తేదీ 04.10.2014 న, 23837 చదరపు అడుగుల నిడివి గల ఒక నిర్దిష్ట స్థిరాస్తిని విడుదల చేయడానికి యూకో బ్యాంక్ నుండి ఎన్ఓసి పొందారు. తేదీ 23.12.2014 న జైపూర్లోని ఐడిబిఐ బ్యాంక్ నుండి, షరతులకు లోబడి కొన్ని నిర్దిష్ట యూనిట్లను బదిలీ చేయడం కోసం, ఎన్ఓసి పొందినారు. అదేవిధంగా, తేదీ 24.03.2015న ముంబైలోని డిహెచ్ఎఫ్ఎల్ వారు 11,538 చదరపు అడుగుల నిడివి గల యూనిట్లను అమ్మడం కోసం ఎన్ఓసి ఇవ్వడం జరిగింది.

6. ధరఖాస్తుదారుల కేసు ఇంకా ఈ విధంగా ఉన్నది: ధరఖాస్తుదారుడైన అనూప్ బర్టారియా తన వ్యక్తిగత హోదాలోనూ , మరియు , మిస్టర్ భారత్ బాంబు మరియు అతని సహచరులకు ఏ విధంగానూ సంబంధం లేని తన యొక్క సొంత కరెంట్ ఖాతా నుండి సొమ్మును చెల్లించియు, వరల్డ్ ట్రేడ్ పార్కులో, 407, 408 మరియు 409 నెంబర్లు గల మూడు కార్యాలయాలను, కొనుగోలు చేయడం జరిగింది.

7. మిస్టర్ భారత్ బాంబు, అతని సహచరులు మరియు సిండికేట్ బ్యాంక్ యొక్క (1) ఉదయపూర్ లోని బాపూ బజార్ బ్రాంచి (2) జైపూర్ లోని మాల్వియా నగర్ బ్రాంచి (3) జైపూర్ లోని ఎంఐ రోడ్ బ్రాంచి, ఈ మూడు శాఖల యొక్క అధికారులు ఇంకొందరు వ్యక్తులు , వీరందరిపై తేదీ 07.03.2016 న , న్యూఢిల్లీ లోని సిబిఐ, బిఎస్ & ఎఫ్ సి వారు అవినీతి నిరోధక చట్టము, 1988 లోని సెక్షన్ 13 (1) (డి) తో పాటు కలిపి చదవబడిన సెక్షన్ 13 (2) మరియు ఐపిసి 120బి, 420, 467, 468, 471, 472 మరియు 474 సెక్షన్ల క్రింద ఎఫ్ఐఆర్ నెం. ఆర్సిబిడి 1/2016 ఇ/0002 ను నమోదు చేయడం జరిగింది. బ్యాంక్ ను మోసం చేసి రూ. 18, 000 కోట్లకు పైగా డబ్బును లాండరింగ్ చేయడం కోసం మిస్టర్ భారత్ బాంబ్ మరియు అతని సహచరులు, సిండికేట్ బ్యాంక్ అధికారులతో కలిసి కుమ్మక్కయ్యి అతని యొక్క క్లయింట్లు/ఉద్యోగులు/కుటుంబ సభ్యులు ఇంకా సిండికేట్ బ్యాంక్ లోని అప్పటికి ప్రస్తుత ఖాతాదారుల కెవైసి పత్రాలను దుర్వినియోగం చేశారని ఇందువలన రూ. 1055.79 కోట్ల డబ్బు ప్రక్క దారి పట్టడం జరిగిందని ఈ ఎఫ్ఐఆర్ లో పేర్కొనడం జరిగింది. మిస్టర్ భారత్ బాంబ్ మరియు కొంతమంది సిండికేట్ బ్యాంకు అధికారులకు వ్యతిరేకంగా తేదీ 14.06.2016 న, సిబిఐ, బిఎస్ & ఎఫ్ సి వారు జైపూర్లోని సిబిఐ కోర్టు ముందు ఛార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది.

8. పైన చెప్పిన ఎఫ్ఐఆర్ లో సిబిఐ నమోదు చేసిన కొన్ని నేరాలు మనీలాండరింగ్ నిరోధక చట్టము, 2002 (పిఎంఎల్ఎ) కింద షెడ్యూల్ చేసిన నేరాలు కాబట్టి, జైపూర్ లోని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్ఫోర్స్ మెంట్ (ఇడి) వారు ఎన్ఫోర్స్ మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్) ను తేదీ 11.07.2016 న నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించినారు.

9. మిస్టర్ భారత్ బాంబ్ సృష్టించిన మరియు నిర్వహిస్తున్న కల్పిత సంస్థలు / కంపెనీలు అయిన ఎం/ఎస్ బి. కె. బిల్డర్స్, ఎం/ఎస్ రాజ్ దర్బార్ మెటీరియల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎం/ఎస్ రాజ్ దర్బార్ మెటీరియల్ ట్రేడింగ్ ఎల్ ఎల్ పి , జై హనుమాన్ కన్స్ట్రక్షన్ & ఎం/ఎస్ ఓమ్నియా ఎంటర్టైన్మెంట్ అండ్ హాస్పిటాలిటీ మొదలైన వాని ఖాతాల నుండి ధరఖాస్తుదారుడు అయిన అనూప్ బర్తారియా మరియు అతని సంస్థలైన, ఎం/ఎస్ వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ మరియు ఎం/ఎస్ సింథర్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ లు మోసపూరితంగా 160 కోట్ల రూపాయలు తీసుకున్నట్లుగా దర్యాప్తులో తెలుసుకోవడం జరిగినది.

10. దాని మీదట ఎస్. బి. క్రిమినల్ రిట్ పిటిషన్ నెం. 704/2018 ని హైకోర్టు ముందు దాఖలు చేసి, అనూప్ బర్తారియా, తేదీ 11.07.2016 నాటి ఇసిఐఆర్ ను రద్దు పరచమని కోరినారు. ఈ ధరఖాస్తు కోర్టు ముందు ఉండగానే ఈ ఇ సిఐఆర్ కు సంబంధించి , ప్రస్తుత ధరఖాస్తుదారులు మరియు మరికొందరు వ్యక్తులపై , తేదీ 17.07.2018న, ప్రాసిక్యూషన్ వారు ఫిర్యాదును దాఖలు చేయడం జరిగినది. దానితో ధరఖాస్తుదారులు ఆ ఫిర్యాదును కూడా రద్దు చేయమని కోరుతూ ఎస్. బి. క్రిమినల్ రిట్ ధరఖాస్తు నెం. 757/2018 ను దాఖలు చేసుకున్నారు. ఈ రెండు రిట్ ధరఖాస్తులను రూ. 50, 000/- ల జరిమానాను విధిస్తూ , హైకోర్టు ప్రస్తుత వివాదాస్పద ఉత్తర్వు ద్వారా, కొట్టివేయడం జరిగినది.

11. పిటిషనర్ల తరఫున వారి న్యాయవాది శ్రీ స్వదీప్ హోరా వాదనను వినిపించారు. వారి ముఖ్యమైన వాదం ఏమిటంటే , సిబిఐ వారు మిస్టర్ భారత్ బాంబు మరియు సిండికేట్ బ్యాంక్ అధికారులకు వ్యతిరేకంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో కానీ తర్వాత ఈడీ వారు నమోదు చేసిన ఇసిఐఆర్ లో కానీ ధరఖాస్తుదారుల పేర్లు లేవు, అయినా, ఈడీ వారు ఈ ఇసిఐఆర్ మీద దర్యాప్తు పూర్తి చేసి దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో ధరఖాస్తుదారులను చేర్చినారు అని. వీరి వాదన ఇంకా ఏమిటంటే , పీఎంఎల్ఏలోని సెక్షన్ 4తో పాటు చదవబడిన సెక్షన్ 3 చెప్పిన ప్రకారం, ఈ చట్టం యొక్క సెక్షన్ 2 (1) (యు) లో నిర్వచింపబడిన నేర గ్రస్థ రాబడులకు సంబంధించిన కార్యకలాపాల విధి విధానాల గురించి ఎరుక కలిగి ఉండడం లేదా వాస్తవంగా ప్రమేయం కలిగి ఉండడం అనేది అనివార్యమైన మరియు ముఖ్యమైన అంశం, అందువల్ల ఈ ముఖ్యమైన అంశం గురించిన పరిజ్ఞానం ఉంటే తప్ప ఈ చట్టం క్రింద ఫిర్యాదును గానీ , కార్యకలాపాలను గానీ మొదలు పెట్టడానికి వీలు కాదు. ప్రస్తుత కేసులో ధరఖాస్తుదారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడానికి అవసరమైన ఏ అంశం లేదు. అందువలన ఈ ఫిర్యాదు చట్టప్రకారం సమర్ధనీయం కాదు అందువలన ధరఖాస్తుదారులకు వ్యతిరేకంగా పిఎంఎల్ఎ క్రింద ఈ కార్య వ్యవహారాలను కొనసాగించడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడం అవుతుంది.

12. ధరఖాస్తుదారులపై చేసిన అభియోగాలను గురించిన తన వాదములను విశదపరుస్తూ శ్రీ హోరా ఇంకా ఈ విధంగా చెప్పినారు: ధరఖాస్తుదారులకు మిస్టర్ భారత్ బాంబ్ మరియు అతని సహచరులతో ఉన్న సంబంధం కొనుగోలుదారు మరియు అమ్మకం దారుల మధ్య ఉన్న సంబంధం మాత్రమే. ధరఖాస్తుదారులకు ఈ సొమ్ము నేర సంబంధమైనది అని తెలియదు. ఇందు సంబంధంగా, **నికేష్ తారాచంద్ షా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా ((2018) 11 SCC 1 8)** కేసుపై శ్రీ హోరా ఆధారపడినారు. వీరు ఇంకా ఈ విధంగా తెలిపినారు: మొదటగా మిస్టర్ భారత్ బాంబ్ ధరఖాస్తుదారులను ఎం/ఎస్ రాజ్ దర్బార్ మెటీరియల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట

కొన్ని యూనిట్లను బుక్ చేయమని అభ్యర్థించినారని, తరువాత వారు అడిగిన ప్రకారం వివిధ 34 అనుబంధ సంస్థల పేరిట రిజిస్టర్డ్ క్రయ పత్రాలను అమలు చేయడం జరిగిందని , ఎం/ఎస్ రాజ్ దర్బార్ మెటీరియల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి అందుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించిన తరువాత డిమాండ్ డ్రాఫ్ట్లు లేదా ఆర్టీజీఎస్ ద్వారా ప్రతి సంస్థ నుండి సంబంధిత మొత్తాలను విడిగా స్వీకరించినారు. ఈ లావాదేవీలలో, ధరఖాస్తుదారులు 76.72 కోట్ల రూపాయల క్రయ ధనాన్ని మాత్రమే అందుకున్నారు కానీ ఈ కేసులో ఆరోపించబడినట్లుగా 150 కోట్ల రూపాయల క్రయ ధనం కాదు.

13. యూకో బ్యాంక్, ఐడిబిఐ మరియు డిహెచ్ఎఫ్ఎల్ నుండి చెల్లుబాటు అయ్యే ఎన్ఓసిలను పొందిన తరువాత పిటిషనర్లు యూనిట్లను విక్రయించారని, పిటిషనర్లు పేర్కొన్న యూనిట్లకు సంబంధించి అన్ని బకాయిలను క్లియర్ చేసినందున ఏ బ్యాంకు కూడా పిటిషనర్లపై ఎటువంటి ఫిర్యాదును లేవనెత్తలేదని శ్రీ హోరా సమర్పించారు.పిటిషనర్–అనూప్ బర్తారియా ఒక ప్రఖ్యాత వాస్తుశిల్పి కావడంతో ఉదయపూర్లోని తన రాయల్ రాజ్ విల్లాస్ ప్రాజెక్ట్ కోసం మిస్టర్ భారత్ బాంబ్ నకు నిర్మాణ సేవలను అందించారని, మిస్టర్ బాంబ్ నుండి అందుకున్న రుసుము మొత్తం కూడా పిటిషనర్ల ఆదాయపు పన్ను, సేవా పన్ను వివరణలలో ప్రతిబింబించిందని ఆయన సమర్పించారు.

14. మిస్టర్ హోరా ప్రకారం, పీఎంఎల్ఏ కింద ఆరోపించిన నేరాలు గుర్తించదగిన నేరాలు కావు మరియు ఈడీ నిర్వహించిన మొత్తం దర్యాప్తు, చట్టం ఇచ్చిన అధికారం లేకుండా, జరిగింది. చివరగా, మిస్టర్ హోరా ఈ విధంగా చెప్పారు. మిస్టర్ భారత్ బాంబుతో ధరఖాస్తుదారులకు ఏ విధమైన సంబంధము లేదు. వీరు వ్యాపారంలో నష్టాన్ని అనుభవిస్తున్నారు , విశ్వసనీయతను కోల్పోతున్నారు, అందువలన ఫిర్యాదును రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అందువలన **పెప్సి ఫుడ్స్ లిమిటెడ్ మరియు మరొకరు వర్సెస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్**

**మరియు ఇతరులు ( (1998) 5 SCC 749)** **కేసులో** ఈ కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా , ఫిర్యాదును రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**15.** పై వాదములను తీవ్రముగా ప్రతిహతిస్తూ, ప్రతివాదుల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఈ క్రింది విధముగా వాదములను సమర్పించారు:

హైకోర్టు ముందు దాఖలైన పిటిషన్లు నిస్సారమైనవి కనుక హైకోర్టు వానిని జరిమానా విధిస్తూ మరీ తిరస్కరించినది, ఈ ఉత్తర్వు న్యాయమైనది మరియు సరైనది కాబట్టి దీనిలో ఈ కోర్టు జోక్యం చేసుకొనకూడదు. **హర్యానా రాష్ట్రం మరియు ఇతరులు వర్సెస్ భజన్ లాల్ మరియు ఇతరులు, కేసు (1992 Suppl. (1) SCC 335) లోని** తీర్పుపై ఆధారం ఉంచుతూ వీరు ఇంకా ఈ విధంగా చెప్పినారు:

స్థూల దృష్టికి గోచరించని , ఏ విధముగా నేరంగా పరిగణింపబడని , ముఖ విలువపై చేసిన ఆరోపణలు మాత్రమే గల , అరుదైన కేసులలోని అరుదైన కేసులలో మాత్రమే, ఫిర్యాదును రద్దు చేసే అధికారాన్ని వినియోగించవచ్చు. ప్రస్తుత కేసులో అధీకృత అధికారి పిఎంఎల్ఏ కింద చేసిన దర్యాప్తులో ధరఖాస్తుదారులపై స్థూలముగా నేరాలను ఆరోపించగల నిర్ధిష్టమైన మనీలాండరింగ్ ఆరోపణలు బయల్పడినవి.

16. ప్రాసిక్యూషన్ ఫిర్యాదుపై ఆధారపడుతూ, గౌరవ అడిషనల్ సొలిసిటర్ జనరల్ , ఈ విధంగా చెప్పినారు: ధరఖాస్తుదారు అయిన అనూప్ బర్టారియా వరల్డ్ ట్రేడ్ పార్క్ పేరిట మూడు కార్యాలయాలను కొనుగోలు చేయడం అనే నెపంతో మోసపూరితముగా సిండికేట్ బ్యాంక్ నుండి 4.8 కోట్ల రూపాయల రుణాన్ని పొందడం వలన , సిండికేట్ బ్యాంక్ తేదీ 23.03.2017న, సిబిఐ వారికి ఎఫ్ఐఆర్ ను ఇవ్వడం జరిగింది . మిస్టర్ భారత్ బాంబ్ మరియు అతని సహచరులు

నిర్వహించే వివిధ కల్పిత సంస్థల నుండి పొందిన సొమ్ము నుండి 1.5 కోట్ల రూపాయల రుణాన్ని వివిధ వాయిదాలలో చెల్లించినట్లు కూడా ఈ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు తెలుపుతున్నది. ధరఖాస్తుదారైన అనూప్ బర్టారియా తేదీ 30.09.2014 న, సిండికేట్ బ్యాంకులో తెరిచిన కరెంట్ ఖాతాను కేవలం మిస్టర్ భారత్ బాంబ్ నుండి అక్రమ ధనాన్ని పొందడం కోసం తప్ప , ఇంకే విధమైన లావాదేవీల కోసం ఉపయోగించలేదని కూడా అదనపు సొలిసిటర్ జనరల్ చెప్పినారు. ఈ ఖాతాను అనూప్ బర్టారియా 2015-16 అసెస్ మెంట్ సంవత్సరానికి గానూ దాఖలు చేసిన ఆదాయపు పన్ను రిటర్న్ లో చూపలేదు.

17. ధరఖాస్తుదారైన అనూప్ బర్టారియా మరియు అతని సంస్థ, తమ వరల్డ్ ట్రేడ్ పార్క్ ప్రాజెక్ట్ కోసం ఆ ప్రాజెక్ట్ లోని యూనిట్లను ఐడిబిఐ బ్యాంక్/డిహెచ్ఎఫ్ఎల్ మరియు యుకో బ్యాంక్ నకు తనఖా పెట్టి ఆ బ్యాంక్ ల నుడి రుణాలను పొందడం జరిగినది. ఈ లావాదేవీల షరతుల ప్రకారం, వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ సంస్థ ఐడిబిఐ బ్యాంకులో ఒక ఎస్క్రో ఖాతాను తెరవడం జరిగినది. ఈ ఖాతాలోనే క్రయ ధనం అంతా జమ చేయాల్సి ఉంటుంది. కానీ, ఈ ఖాతాలో మిస్టర్ బర్టారియా ఏ సొమ్మును జమ చేయకుండా సిండికేట్ బ్యాంకులో ఖాతా తెరవడం ద్వారా మిస్టర్ భారత్ బాంబ్ మరియు అతని సహచరులకు అక్రమ ధనాన్ని జమ చేయడానికి వీలు కల్పించారు. ఎన్ఓసి ఇవ్వడం కోసం ఐడిబిఐకి ఇచ్చిన అభ్యర్థన లేఖలలో 407, 408 మరియు 409 నెంబర్లు గల కార్యాలయాలకు సంబంధించిన కస్టమర్ పేరుకు M/s రాజ్ దర్బార్ మెటీరియల్ లిమిటెడ్ గానూ , ఇవి అమ్ముడుపోని ఆస్తులు గానూ చూపడం జరిగింది.

18. ధరఖాస్తుదారైన –అనూప్ బర్టారియాకు సంబంధించిన M/S వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ అనే సంస్థ, ఇంతకుముందు M/S. R. F. ట్రేడింగ్ అండ్ ప్రాపర్టీస్ మరియు ఎం/ఎస్. సిన్సియర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేర్లు కలిగి ఉండినదనియు మరియు ఇది అక్టోబర్ 2013 నుండి

మోసం బయట పడిన సమయం వరకు భారత్ బాంబ్ మరియు అతని సహచరులు కల్పించి మరియు నిర్వహించిన కల్పిత సంస్థల ఖాతాల నుండి 160 కోట్లకు పైగా అక్రమ సొమ్మును అందుకున్నారనియు, గౌరవ అదనపు సొలిసిటర్ జనరల్ , కౌంటర్ అఫిడవిట్ మీద ఆధారపడి , కోర్టుకు తెలిపినారు.

19. దరఖాస్తుదారుడైన అనూప్ బర్టారియా యొక్క అపరాడిత్వము , ఈ నేర ఫలాన్ని భారత్ బాంబుతో పంచుకున్న తీరు మరియు అతడు నేర కలాపాలలో ఎలా నేరుగా పాల్గొని నేరాలకు సంబంధించిన రాబడిని సృష్టించడం , ఆర్జించడం మరియు వినియోగించడం చేయడం గురించి తెలపడానికి, గౌరవ అదనపు సొలిసిటర్ జనరల్ , ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదు మీద , మరీ ముఖ్యంగా దానిలోని 10. 5 మరియు 10.8 పేరాల మీద, ఆధారపడినారు.

20. ఫైనాన్స్ (నెం. 2) చట్టము, 2019 ద్వారా చేర్చబడిన నిబంధనకు ఇచ్చిన వివరణతో కూడా సెక్షన్ 45 చదివినప్పుడు పిఎంఎల్ఏ కిందకు వచ్చే నేరాలు "గుర్తించదగినవి మరియు జామీనుకు అనర్హమైనవి" అని తెలుస్తున్నదని ఆయన వివరించారు. ఇంకా ధరఖాస్తుదారులపై బలవంతపు చర్యలు తీసుకోకూడదని ప్రతివాదులను ఆదేశిస్తూ, ఈ కోర్టు జారీ చేసిన ఉత్తర్వు కారణంగా, సమర్థ న్యాయస్థానం ముందు కార్యకలాపాలు నిలిపివేయబడ్డాయి మరియు దర్యాప్తు కూడా నిలిచిపోయిందని, అందువలన పిఎంఎల్ఎ కింద ఈడీ దాఖలు చేసిన కేసుపై ప్రతికూల ప్రభావం పడినదని, అదనపు సొలిసిటర్ జనరల్, చివరగా చెప్పినారు.

21. ఇప్పుడు, పీఎంఎల్ఏ కింది మనీలాండరింగ్ నేరాలు గుర్తించదగినవా కాదా అనే ప్రశ్నపై ముందు లేవనెత్తిన మొట్టమొదటి వాదనకు అనుగుణంగా, నేరాలకు సంబంధించిన సెక్షన్ 45 లోని సబ్ సెక్షన్ (1) ను 2005 చట్టము 20 ద్వారా సవరించినట్లు గమనించవచ్చు.సవరణకు ముందు సెక్షన్ 45 లోని సబ్–సెక్షన్ 1 క్రింది విధంగా చదవబడుతుంది:

**"సెక్షన్ 45–నేరాలు గుర్తించదగినవి మరియు జామీనుకు అనర్హమైనవి అగుటకు–**

(1) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 (1974లోని 2) లో ఏమి ఉనప్పటికీ,

(ఎ) ఈ చట్టము కింద శిక్షార్హమైన ప్రతి నేరం గుర్తించదగినదిగా ఉంటుంది.

(బి) షెడ్యూల్లోని పార్ట్ ఎ కింద మూడు సంవత్సరాలకు పైగా జైలు శిక్ష విధించదగిన నేరానికి పాల్పడిన ఏ వ్యక్తిని జామీను మీద లేదా తన సొంత బాండు పైన విడుదల చేయబడకూడదు."

**22. తదనంతరం, 2005 డబ్ల్యు. ఇ. ఎఫ్. చట్టము 20 ద్వారా సబ్-సెక్షన్ (1) స్థానంలో క్రింది విధంగా ఉంచబడింది.**

" (1) కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, 1973 (1974 లోని 2) లో ఏమైనప్పటికీ, [ఈ చట్టం కింద] నేరానికి పాల్పడిన ఏ వ్యక్తిని జామీను మీద లేదా తన సొంత బాండుపై విడుదల చేయకూడదు.

23. సందేహాలను తొలగించడానికి, సెక్షన్ 45కి వివరణ ఫైనాన్స్ (నెం. 2) చట్టము, 2019 W. E. F. 1.8.2019 ద్వారా చేర్చబడిందని గమనించవచ్చు, ఇది క్రింది విధంగా ఉందిః

"**వివరణ**-సందేహాలను తొలగించడానికి, "నేరాలు గుర్తించదగినవి మరియు బెయిలబుల్ కానివి" అనే వ్యక్తీకరణ అంటే, ఈ చట్టము క్రింద ఉన్న అన్ని నేరాలు గుర్తించదగిన నేరాలు మరియు నాన్ బెయిలబుల్ నేరాలుగా ఉంటాయని ఎల్లప్పుడూ భావించబడతాయని స్పష్టం చేయబడింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 (1974లోని 2) లో దీనికి విరుద్ధంగా ఏమైనా ఉన్నప్పటికీ, తదనుగుణంగా ఈ చట్టము కింద అధికారం పొందిన అధికారులకు, సెక్షన్ 19 కింద షరతుల నెరవేర్పుకు లోబడి, వారెంట్ లేకుండా నిందితుడిని అరెస్టు చేసే అధికారం ఉంది."

24. పైన పేర్కొన్న సబ్-సెక్షన్ (1) ను ప్రతిగా ఉంచుట మరియు సెక్షన్ 45కి వివరణను చొప్పించడం, మరియు సెక్షన్ 45 యొక్క చిన్న శీర్షికలో సవరణ చేయకపోవడం వలన పిఎంఎల్ఎ కింద ఉన్న అన్ని నేరాలు "గుర్తించదగిన మరియు నాన్-బెయిలబుల్ నేరాలు" నుండి, క్రిమినల్

ప్రొసీజర్ కోడ్, 1973లోని అంశాలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ, "నేరాలన్నీ గుర్తించదగిన మరియు నాన్–బెయిలబుల్ నేరాలు" అనడం అనే విషయంలో ఏ సందేహానికి తావు లేదు . దీని ప్రకారం, పిఎంఎల్ఎ చట్టము కింద అధికారం పొందిన అధికారులకు, సెక్షన్ 19 కింది షరతుల నెరవేర్పుకు లోబడి మరియు సెక్షన్ 45 కింద పొందుపరచబడిన షరతులకు లోబడి, వారెంట్ లేకుండా నిందితుడిని అరెస్టు చేసే అధికారం ఉంది. ఈ చట్టము యొక్క సెక్షన్ 45 ను న్యూఢిల్లీ లోని భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలో వున్న రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు, తేదీ 11.11.2014 న ఇచ్చిన ఉత్తర్వుతో కలిపి చదవడం వలన వచ్చిన అధికారంతో , సమర్థుడైన అధికారి , ఇసిఐఆర్ No. JPZO/01/2016 లో దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదు నెం.12/2018 లో చెప్పిన విషయాలను బట్టి , ఈ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును సమర్థ అధికారి దాఖలు చేయలేదు , అన్న శ్రీ హోరా గారి వాదన నిస్సారమని తెలుయుచున్నది.

25. పీఎంఎల్ఏలోని సెక్షన్ 3 క్రింద నిర్వచించిన విధంగా ధరఖాస్తుదారులకు , తాము నేర సంబంధమైన రాబడితో ప్రమేయము కలిగి ఉన్నామని తెలిసి ఉండడం అనేది , మనీలాండరింగ్ నేరానికి అనివార్యమైన మరియు ముఖ్యమైన అంశం అని , కానీ ప్రస్తుత కేసులో భారత్ బాంబు మరియు అతని సహచరుల యొక్క నేర రాబడితో తాము ప్రమేయం కలిగి ఉన్నామని ధరఖాస్తుదారులకు తెలుసు అని చెప్పడానికి , ఏ విధమైన ఆధారాలు చూపబడలేదని , అందువలన పీఎంఎల్ఏ క్రింద ధరఖాస్తుదారులకు వ్యతిరేకంగా కార్యకలాపాలను కొనసాగించడం , చట్ట ప్రక్రియను దురుపయోగము చేయడం అవుతుంది అనియూ , ధరఖాస్తుదారుల తరపున వారి న్యాయవాది శ్రీ హోరా సమర్పించిన వాదనలు నిలబడడానికి ఏ విధమైన ఆస్కారం లేదు.
పీఎంఎల్ఏలోని సెక్షన్ 3, మనీలాండరింగ్ నేరాన్ని ఈ క్రింది విధంగా నిర్వచిస్తున్నదని మనం గమనించవచ్చు:

"3. **మనీలాండరింగ్ నేరం**.——

ఎవరైనా నేరమునకు సంబంధించిన రాబడిని దాచడం , కలిగి ఉండడం , సంపాదించడం, వినియోగించడం లేదా ఆకళంకిత ఆస్తిగా ప్రతిపాదించడం అనేవి కూడా చేరిన ఏదైనా ప్రక్రియ లేదా కార్య కలాపములో, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ, జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించినా లేక ఎరుక కలిగి సహాయం చేసిన లేక ఎరుక కలిగి భాగం పంచుకున్న లేక వాస్తవంగా పాల్గొన్నా, అతడు మనీలాండరింగ్ నేరానికి దోషి అవుతాడు.

[ **వివరణ.**— సందేహాలను తొలగించడానికి, ఈ క్రింది విధముగా స్పష్టత ఇవ్వబడినది–

(i) ఒక వ్యక్తి ఈ క్రింద చెప్పబడిన విధంగా నేర సంబంధ రాబడికి చెందిన కార్య కలపాలలో, ఒకటి లేక అంతకంటే ఎక్కువ వాటిలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించినా లేక, ఎరుక కలిగి సహాయం చేసినా లేక ఎరుక కలిగి భాగం పంచుకున్నా లేక వాస్తవంగా పాల్గొన్నా , అతడు మనీలాండరింగ్ నేరానికి దోషి అవుతాడు.

ఆ కార్య కలాపములు:—

(ఎ) దాచడం; లేదా

(బి) కలిగి ఉండడం; లేదా

(సి)సంపాదించడం; లేదా

(డి)వినియోగించడం; లేదా

(ఇ) ఆకళంకిత ఆస్తిగా ప్రతిపాదించడం; లేదా

(ఎఫ్) ఆకళంకిత ఆస్తి అని ఏ విధముగానైనా క్లెయిమ్ చేయడం;

(ii) నేర రాబడితో ముడిపడి ఉన్న ప్రక్రియ లేదా కార్య కలాపము అనేది, ఒక నిరంతర కార్య కలాపము మరియు ఇది ఒక వ్యక్తి నేర రాబడిని దాచడం లేదా కలిగి ఉండడం లేదా సంపాదించడం లేదా ఉపయోగించడం లేదా కళంకం లేని ఆస్తిగా చూపించడం లేదా దానిని ఏ విధంగానైనా కళంకం లేని ఆస్తిగా క్లెయిమ్ చేయడం ద్వారా, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా (ఈ ఆస్తిని) అనుభవించే వరకు కొనసాగుతుంది."

26. సెక్షన్ 2 (యు) "నేర రాబడి" అంటే ఏమిటో నిర్వచిస్తుంది మరియు సెక్షన్ 2 (వై) "షెడ్యూల్డ్ నేరం" అంటే ఏమిటో నిర్వచిస్తుంది. రికార్డు నుండి స్పష్టంగా తెలుస్తున్నట్లుగా, ఎఫ్ఐఆర్ నెం. ఆర్సిబిడి 1/2016 ఇ/0002 మూలకంగా తేదీ 07.03.2016 సిబిఐ వారు చేసిన దర్యాప్తు ఆధారంగా పిఎంఎల్ఏ క్రింద ఇసిఐఆర్ లో ప్రాసిక్యూషన్ ఫిర్యాదును, ఇ డి వారు ధరఖాస్తుదారులు మరియు ఇతరులకు వ్యతిరేకంగా దాఖలు చేసినారు. మరియు భారత్ బాంబు మరియు ఇతరులకు వ్యతిరేకంగా ఐపిసి 120బి, 420, 467, 468, 471, 472 మరియు 474 సెక్షన్లు మరియు అవినీతి నిరోధక చట్టము, 1988 లోని సెక్షన్ 13 (1) (డి) తో కలిపి చదివబడిన సెక్షన్ 13 (2) కింది నేరాలకు గానూ , భారత్ బాంబు మరియు ఇతరులపై తేదీ 14.06.2016 న , జైపూర్ సిబిఐ కోర్టు ముందు సిబిఐ వారు చార్జిషీట్ దాఖలు చేసినారు. ఈ చట్టము యొక్క సెక్షన్ 2 (వై) ప్రకారం ఈ నేరాలన్నీ షెడ్యూల్ నేరాలే. ఇందులో , ప్రస్తుత మొదటి ధరఖాస్తుదారుడు అయిన ఎం/ఎస్ వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ కు చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ అయిన అనూప్ బర్తారియా 5 వ ముద్దాయి మరియు ఇందులో 2వ దరఖాస్తుదారుడైన వరల్డ్ ట్రేడ్ పార్క్ లిమిటెడ్ 8 వ ముద్దాయి. వీరిపై ప్రాసిక్యూషన్ ఫిర్యాదులోని 10.5 మరియు 10.8 పేరాలలో స్పష్టమైన ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆరోపణల యొక్క యోగ్యతల విచారణలోకి ఈ కోర్టు వెళ్లవలసిన అవసరం లేదు. పిఎంఎల్ఏ సెక్షన్ 3లో నిర్వచింపబడిన మనీలాండరింగ్ నేరాన్ని దరఖాస్తుదారులు చేసినట్లుగా ప్రథమ దృష్టికి గోచరింపజేయగల తీవ్రమైన మనీలాండరింగ్ ఆరోపణలు మరియు ఈ

ఆరోపణలను బలపరచడానికి సరిపోయినంత సారాంశం గల వివరాలు , ఈ ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో చెప్పబడి ఉన్నాయి, అన్న విషయం చెప్పబడితే చాలు.

27. సెక్షన్ 3లో ఉన్న నిర్వచనాన్ని పరిగణనలోకి తీసుకుంటే, తాను నేర రాబడితో వ్యవహరిస్తున్నాడన్న విషయం నిందితుడికి తెలియడం అనేది, ఈ చట్టము కింద ఫిర్యాదు దాఖలు చేయడానికి ఒక ముందస్తు షరతు లేక అనివార్యంగా చూపించవలసినది అని చెప్పడం మూర్ఖత్వం అవుతుంది. ఈ నిర్వచనం సూచించినట్లుగా, నేరానికి సంబంధించిన రాబడిని దాచడం, కలిగి ఉండడం, లేదా ఉపయోగించడం మరియు దానిని కళంకం లేని ఆస్తిగా చూపించడం లేదా క్లెయిమ్ చేయడం వంటి వాటితో సంబంధం ఉన్న ఏదైనా ప్రక్రియ లేదా కార్య కలాపములో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనడానికి లేదా ఎరుకతో భాగం పంచుకోవడానికి ప్రయత్నించే వారు మనీలాండరింగ్ నేరానికి పాల్పడినట్లు. అందువల్ల, ఎరుక కలిగి ఉండటమే కాకుండా, ఒక వ్యక్తి ప్రత్యక్షంగా గానీ లేదా పరోక్షంగా గానీ నేర సంబంధమైన రాబడికి సంబంధించిన ప్రక్రియ లేక కార్యకలాపాలలో జోక్యం కలుగ చేసుకోవడానికి ప్రయత్నించిన లేక వాస్తవంగా పాల్గొన్నా అతడు మనీలాండరింగ్ నేరానికి దోషి అవుతాడు. ప్రస్తుత కేసులో, దరఖాస్తుదారులు ప్రత్యక్షముగా నేర సంబంధమైన రాబడి యొక్క ప్రక్రియ మరియు కార్య కలాపాలలో ప్రమేయం కలిగి ఉన్నట్లుగా ఆరోపణలను, వానితో పాటు ఆధారాలను ఫిర్యాదులో చెప్పియుండడం వలన సమర్ధ న్యాయస్థానం విచారణ చేయడం అవసరమై ఉన్నది.

**28.** Cr.P.C లోని సెక్షన్ 482 కింద ఫిర్యాదును రద్దు చేసే అధికారాన్ని అరుదుగానూ మరియు జాగ్రత్తగానూ, అది కూడా అరుదైన కేసులలో అరుదైన సందర్భాలలో మాత్రమే ఉపయోగించాలని స్వయంసిద్ధంగా చెప్పవచ్చు. పైన ఉదహరించిన **హర్యానా రాష్ట్రం మరియు ఇతరులు వర్సెస్ భజన్ లాల్ మరియు ఇతరులు కేసులో**, ఏ కోర్టు అయినా న్యాయ ప్రక్రియను దురుపయోగ పరచకుండా చూడడానికి మరియు న్యాయాన్ని కాపాడడానికి సెక్షన్ 482 కింద ఉన్న అధికారాలను వినియోగించడం గురించిన కొన్ని మార్గదర్శకాలను ఈ కోర్టు రూపొందించడం జరిగినది.

“102. ఖచ్చితమైన, స్పష్టంగా నిర్వచించబడిన మరియు తగినంతగా సూత్రీకరించబడిన మరియు కఠినమైన మార్గదర్శకాలు లేక కఠినమైన సూత్రాలను నిర్దేశించడం సాధ్యం కాకపోయినా, ఈ చట్టము (సిఆర్‌పిసి) లోని IV అధ్యాయంలో చెప్పబడిన వివిధ సంబంధిత నిబంధనల నిర్వచనం మరియు ఆర్టికల్ 226 కింద ఉన్న అసాధారణ అధికారాన్ని ఉపయోగించడం లేదా ఈ చట్టంలోని సెక్షన్ 482 కింది అంతర్లీన అధికారాలకు సంబంధించిన నిర్ణయాల శ్రేణిలో, మేము సేకరించి పొందుపర్చిన, ఈ కోర్టుచే ప్రతిపాదితమైన వివిధ చట్ట సూత్రాల నేపథ్యంలో, అటువంటి అధికారాన్ని కోర్టు ప్రక్రియ ద్వారా దుర్వినియోగపర్చకుండా ఉండడానికి మరియు న్యాయాన్ని రక్షించడానికి , చట్టం యొక్క లక్ష్యాలను కాపాడే విధంగా ఉపయోగించగల ఈ క్రింది వర్గాల కేసులను ఉదాహరణలుగా ఇస్తున్నాము.

(1) ఒక మొదటి సమాచార నివేదికలో కానీ , ఫిర్యాదులో కానీ చేయబడిన ఆరోపణలను, వాని ముఖ విలువ ప్రకారము మరియు పూర్తిగానూ అంగీకరించినప్పటికీ, అవి ముద్దాయికి వ్యతిరేకంగా ఏ నేరాన్ని ప్రాధమికంగా ఏర్పరచలేకపోయినప్పుడు;

(2) మొదటి సమాచార నివేదికలోని ఆరోపణలు మరియు ఎఫ్ఐఆర్ తో పాటు ఉన్న ఇతర సమాచారాలు ఏవీ కూడా సిఆర్‌పిసిలోని సెక్షన్ 155 (2) క్రింద మెజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వు ద్వారా తప్ప , సిఆర్‌పిసి లోని సెక్షన్ 156 (1) కింద పోలీసులు దర్యాప్తును కొనసాగించడాన్ని సమర్ధించగల ఏదైనా గుర్తింపు కలిగిన నేరాన్ని తెలియజేయనప్పుడు;

(3) ఎఫ్ఐఆర్ లేక ఫిర్యాదులోని ప్రతిహతించబడని ఆరోపణలు వానిని బలపరిచే విధంగా సేకరించబడిన సాక్ష్యాలు కూడా నిందితుడు ఏ నేరమైన చేసినట్లుగా చూపగల కథనాన్ని తెలియజేయకపోయినట్లైతే.

(4) ఎఫ్ఐఆర్ లో ని ఆరోపణలు గుర్తించదగిన నేరమును గాక , సిఆర్‌పిసి లోని సెక్షన్ 155 (2) క్రింద మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా మాత్రమే ,

పోలీసులచే దర్యాప్తును అనుమతించగల , గుర్తింపు లేని నేరమును మాత్రమే తెలియజేసినప్పుడు.

(5) ఎఫ్ఐఆర్ లేక ఫిర్యాదులోని ఆరోపణలు అసంబద్ధమైనవి, అంతర్గతంగా అసంభవమైనవి అయినందువలన , వాని ఆధారంగా, ఏ వివేకవంతుడైన వ్యక్తి కూడా, నిందితుడిపై చర్య తీసుకోవడానికి తగినంత ఆధారం ఉన్నదని నిర్ధారణకు రాలేనప్పుడు.

(6) నేర కార్యకలాపాలను కొనసాగించడానికి సిఆర్పిసి లోని నిబంధనలలో కానీ, లేక సంబంధిత చట్టం (దేని క్రింద అయితే కేసు కార్యకలాపాలు మొదలు పెట్టబడినవో) లోని నిబంధనలలో కానీ ఈ కార్యకలాపాలు మొదలుపెట్టడానికి లేదా కొనసాగించడానికి నిర్దిష్టమైన, చట్టపరమైన అడ్డంకి పొందుపరచబడి ఉంటే లేక సిఆర్పిసిలో కానీ లేక సంబంధిత చట్టములో కానీ వేధితుని యొక్క వ్యధకు సమర్ధవంతమైన పరిష్కారం స్పష్టంగా పొందుపర్చబడినప్పుడు;

(7) నేర విచారణ స్పష్టమైన దురుద్దేశాలతో కూడి ఉన్నప్పుడు మరియు/లేదా నిందితుడిపై ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో మరియు అతనిపై వ్యక్తిగతమైన కక్ష సాధించే ఉద్దేశ్యంతో తేలిక పరచడం కోసం దురుద్దేశపూర్వకంగా విచారణ ప్రారంభించబడినప్పుడు."

29. దరఖాస్తుదారులు యొక్క కేసు పైన చెప్పిన వర్గాలలో దేని కిందికీ రాదు. ప్రతివాది అధికారుల వలన కోర్టు ప్రక్రియ ఏ విధంగానైనా దుర్వినియోగం కాబడినదని ధరఖాస్తుదారులు చెప్పడంలో విఫలమయ్యారు. పీఎంఎల్ఏ క్రింద చెప్పబడిన విధంగా, ఆరోపింపబడిన మనీలాండరింగ్ నేరంలో ధరఖాస్తుదారుల పాత్ర ఉన్నదని ప్రాథమికంగా చెప్పడానికి తగినన్ని ఆధారాలు ఉన్నందున, హైకోర్టు సరిగానే ధరఖాస్తుదారుల ధరఖాస్తులను త్రోసిపుచ్చినది. చట్టము యొక్క ఉద్దేశ్యాలు, లక్ష్యాలలో చెప్పిన విధంగా, మనీలాండరింగ్ అనేది దేశ ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే కాకుండా దేశ సమగ్రతకు మరియు సార్వభౌమత్వానికి కూడా తీవ్రమైన ముప్పును కలిగిస్తుంది. అందువలన ఇటువంటి నేరాలకు సంబంధించి ఉదారమైన దృక్పథం చూపడం న్యాయాన్ని అపహాస్యం చేసినట్లు అవుతుంది.

30. కేసు ముగించే ముందు దరఖాస్తుదారులు , హైకోర్టు 21.02.2019 న ఇచ్చిన వివాదాస్పద తీర్పును రద్దు చేయడం అనే ప్రధానమైన ఉపశమనంతో పాటు జైపూర్లోని పిఎంఎల్ ఏ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు పెండింగ్లో ఉన్న ECIR No.JPZO/01/2016 లోని ప్రా సిక్యూషన్ ఫిర్యాదు నెంబర్ 12/2018 కి సంబంధించిన పూర్తి కార్యకలాపాలను నిలుపు చేయాలని మధ్యంతర ఉత్తర్వులను కూడా కోరినారు కానీ ఎస్ ఎల్ పి కి సంబంధించిన కాగితాలు, పుస్తకాలు ఏమియు కూడా దాఖలు చేసి ఉండలేదు. అన్ని లోపాలను సవరించినామని తెలుపుతూ 2019 మార్చి 8న ఈ స్పెషల్ లీవ్ ధరఖాస్తులను దాఖలు చేసినట్లుగా తెలుస్తున్నది, తరువాత మరికొన్ని పత్రాలను దాఖలు చేయడానికి అనుమతి కోరుతూ తేదీ 25.03.2019 న ఒక దరఖాస్తును దాఖలు చేసి , ప్రాసిక్యూషన్ ఫిర్యాదు నెం.12/2018 ను దరఖాస్తుదారులు రికార్డులోనికి తెచ్చినారు. ఒకసారి స్పెషల్ లీవ్ కోసం దరఖాస్తులు దాఖలు చేసిన తరువాత, కోర్టు అనుమతి లేకుండా ఏ పత్రాలను దాఖలు చేయరాదు అనే విషయమే కాకుండా , ఈ ప్రస్తుత కేసులో , దరఖాస్తుదారులు ఏ విధమైన అనుమతిని అడిగినట్లుగా గానీ దానిని ఇచ్చినట్లుగా గానీ లేదు. ముఖ్యమైన మరియు సంగతమైన పత్రాలను మరియు ముఖ్యంగా యే పత్రాల గురించి అయితే స్పెషల్ లీవ్ దరఖాస్తులో ఉపశమనాన్ని కోరినారో వానిని , దాఖలు చేయకుండా ఉండే పద్ధతిని తీవ్రంగా గర్హించడమైనది. స్పెషల్ లీవ్ దరఖాస్తుతో పాటు సంగతమైన పత్రాలు ముఖ్యంగా, అడిగిన ఉపశమనానికి సంబంధించిన పత్రాలు దాఖలు చేయకపోవడమనే ఒకే ఒక కారణంగా ఈ స్పెషల్ లీవ్ దరఖాస్తులను మొదటిలోనే తిరస్కరించి ఉండవచ్చు.

31. స్పెషల్ లీవ్ దరఖాస్తులకు సంబంధించిన అన్ని సంగత పత్రాలను మరీ ముఖ్యంగా అడిగిన ఉపశమనలకు సమబంధించిన పత్రాలను మొదట స్పెషల్ లీవ్ దరఖాస్తులతో పాటే దాఖలు చేసినారా లేదా అన్న విషయాన్ని తప్పక ధృవీకరించాలని రిజిస్ట్రీ ని ఆదేశించమైనది.

32. ఈ అంశాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని, ఈ దరఖాస్తులను కొట్టివేయడమైనది. ఇంతకుముందు మంజూరు చేసిన మధ్యంతర ఉత్తర్వులను తక్షణమే ముగించడమైనది. ఈ ఉత్తర్వులో దరఖాస్తుదారుల మీద వెలిబుచ్చిన అభిప్రాయాలు కేవలం ప్రాథమికమైనవి అయినందున వీటిచే ఏ విధముగానూ ప్రభావితం కాకుండా , కేసు యొక్క యోగ్యతల మీదే ఆధారపడి , విచారణ న్యాయస్థానం కేసును పరిష్కరిచవలసి ఉంటుందని, చెప్పనవసరం లేదు.

33. ప్రతివాది యొక్క న్యాయవాది చెప్పిన మేరకు, దర్యాప్తు ముగిసి, ఛార్జ్ షీట్ దాఖలు చేయబడినందున, దరఖాస్తుదారుల యొక్క నిర్బంధ విచారణ అవసరం లేదు.

34. ఈ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు విషయంలో చట్టాల అనుసారముగా ముందుకు పోవుటకు ఈడీకి స్వేచ్ఛ ఉన్నది.

35. ఈ తీర్పు యొక్క ప్రతిని సెక్రటరీ జనరల్ మరియు రిజిస్ట్రార్ (జె–ఐ) నకు తగిన చర్యలు తీసుకొనడం కోరకు అందించాలి.

------.న్యాయమూర్తి.
[అజయ్ రస్తోగి]

---......న్యాయమూర్తి.
[బెలా ఎమ్. త్రివేది]

న్యూ ఢిల్లీ;
21.04.2023